వాయిస్ టుడే

హైదరాబాద్
శనివారం, 17 ఫిబ్రవరి, 2024



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 16 2024 (వాయిస్ టుడే) : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని రాడగాంబల బస్తీలో నివాసం ఉంటున్న తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్ బొలెరో డ్రైవర్ మూస ఇంటిలో గుడుంబా విక్రయిస్తున్నరని నమ్మదగిన సమాచారం మేరకు ఆబ్కారీ ఎస్సై శారద సిబ్బందితో కలిసి వారి ఇంటిని తనిఖీ చేయగా 100 గుడుంబా ప్యాకెట్లను గుర్తించారు సుమారు 10 లీటర్లు ఉంటుందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## ఘనంగా ఎల్లమ్మ బండారు ఉత్సవాలు





మక్తల్ ఫిబ్రవరి 16 వాయిస్ టుడే ప్రతినిధి మఖ్తల్ పట్టణంలోని సంత బజార్ వద్ద ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద మాదాసికుర్వ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బండారు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బండారు చల్లుకున్నారు. బండారుతో అనారోగ్య సమస్యలు తీరి, అంతా మంచే జరుగుతుందని నమ్మకం. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న బీరప్ప బండారు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాలకు నేతలు బాలక్రిష్ణారెడ్డి, బి.కొండయ్య, లక్ష్మారెడ్డి, సూర్య నారాయణ గుప్తా, కోళ్ళ వెంకటేష్, గోపాల్ రెడ్డి, గడ్డంపల్లి హనుమంతు, చంద్రకాంత్ గౌడ్, కావలి శ్రీహరి, మాదాసి కుర్వ సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**– జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

కామారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే) గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు అధికారులు సమన్వయంతో పనిచేయవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరములో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తో కలిసి పదవ, తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28 నుండి మర్చి 16 వరకు ఉదయం 9 నుండి మధ్యాన్నం 12 గంటల వరకు జరుగు ఇంటర్ థియరీ పరీక్షలుకు మొదటి సంవత్సరంలో 9,993 మంది , ద్వితీయ సంవత్సరంలో 9,516 మంది విద్యార్థులు హాజరగుచున్నారని, ఇందుకోసం , జిల్లాలోని 37 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు సాఫీగా నిర్వహించుటకు 55 మంది చీఫ్ సూపరింటెండెంట్లు,, సహాయ సూపరింటెండెంట్లు, శాఖ అధికారులతో పటు 2 ఫ్లైయింగ్ స్క్వాడ్, 3 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాగా మార్చి 18 నుండి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9. 30 నుండి మధ్యాన్నం 12. 30 గంటల వరకు జరుగు పదవ తరగతి పరీక్షలకు 62 కేంద్రాలు ఏర్పాటు చేశామని,, 11,962 రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు హాజరగుచున్నారని ఇందులో 5,834 మంది బాలురు కాగా, 6,128 మంది బాలికలని అన్నారు. కేంద్రాలను ఏ,బి,సి, క్యాటగిరీలుగా విభజించి పరీక్షలు సాఫీగా నిర్వహించుటకు 660 మంది ఇన్విజిలేటర్లు,64 మంది రూట్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లను, 3 ఫ్లైయింగ్, 5 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పర్చు చేస్తున్నామని అన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని,విద్యుత్తులో అంతరాయం లేకుండా చూడాలని, సమయానుకూలంగా గ్రామాల నుండి బస్సులను విరివిగా నడపాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఏ యెన్ ఏం /ఆశ కార్యకర్తను ఏర్పాటు చేయాలని సూచించారు. జవాబు పత్రాలు సరిగ్గా రవాణా చేసేలా చూడాలని తపాలా శాఖకు,ట్రెజరీ నుండి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తరలించడంలో, పరీక్షా కేంద్రాల వద్ద కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ జరగకుండా గట్టి పోలిసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు, కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచేలా చూడాలని, 144 సెక్షన్ అమలు చేయాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. పూర్తి సి.సి. కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహింపబడతాయని ఎటువంటి తప్పిదాలు జరగకుండా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. విధులు కేటాయించిన వారు తప్పక హాజరు కావాలని, ఇందులో ఎలాంటి మినహాయింపు లేదని స్పష్టం చేశారు.

కాగా విద్యార్థులు మానసికఒత్తిడులు, ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షవ్రాయాలని, అన్నారు. పరీక్ష సమయానికి గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెస్ పరీక్ష హాలులోకి అనుమతించబడవని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, డీఈఓ రాజు, డి.సి.ఆర్.బి. డిఎస్పీ మదన్ లాల్, పరీక్షల సహాయ కమీషనర్ లింగం, జిల్లా ఖజానా అధికారి సాయిబాబ, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, తపాలా, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు, పారిశ్రామిక భారత్ బంద్ కు మద్దతు ప్రకటించిన కొత్తగూడెం బార్ అసోసియేషన్



కొత్తగూడెం : దేశ వ్యాప్త సమ్మెకు న్యాయవాదులు బాసటగా నిలవాల్సిన బాధ్యత ఉన్నదని కొత్తగూడెం బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం తీర్మానించింది. న్యాయవాది ఎస్.ఉపేందర్ రావు అభ్యర్థనపై కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ కుమార్ మక్కడ్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది.ఎం.ఎస్.స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వ్రాత పూర్వక హామీ మేరకు రైతు పండించిన పంటకు కనీస మద్ధతు ధర ఇచ్చే విధంగా చట్టం తీసుకురావాలని రైతులు కోరడం ఎంతైనా సమంజసమని వక్తలు పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో విచక్షణా రహిత ప్రవేటికరణ కూడా యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తుందని, సమాజిక న్యాయం సన్నగిల్లుతుందని వక్తలు తెలిపారు. రైతులకు, కార్మికులకు, యువతకు మద్దతుగా న్యాయవాదులు కూడా విధులకు హాజరు కారాదని నిర్ణయించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, ఉపాధ్యక్షుడు దుంద్ర రమేష్, క్రీడా కార్యదర్శి పిట్టల రామారావు, గ్రంథాలయ కార్యదర్శి యాస యుగంధర్, మహిళ ప్రతినిధి ఏ.మనోరమ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యరాలు జి.కె.అన్నపూర్ణ, న్యాయవాదులు కె.పుల్లయ్య, తోట మల్లేశ్వర్ రావు, కె. నాగేశ్వర్ రావు, జి. సునంద, జి.కాంతయ్య, మారపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ టీ రోజుకు రెండు కప్పులు తాగితే



లవంగాలు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందాలంటే నోటిలో రెండు లవంగాలు పెట్టుకోవడం వల్ల మంచి ఉపశమనం లభిస్తుంది. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. భోజనం తర్వాత ఒక కప్పు లవంగం టీ తాగాలని సూచిస్తున్నారు. ఇది గ్యాస్, గుండెల్లో మంట సమస్యను తొలగిస్తుంది. లవంగం టీ తీసుకోవడం ప్రారంభించిన తర్వాత, గ్యాస్ సమస్యకు ప్రత్యేకంగా ఔషధం తీసుకోవలసిన అవసరం లేదంటున్నారు నిపుణులు.ఈ టీ సైనస్ నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. లవంగాలలో విటమిన్ ఇ, కె ఉంటాయి. ఇవి బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. లవంగం టీ జ్వరాన్ని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. లవంగాలలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి వాపును తగ్గించడంలో సహాయపడతాయి. కడుపు నొప్పిని నివారించడంలో లవంగాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అయితే అవసరానికి మించి అధికంగ తీసుకుంటే మాత్రం చిక్కులు తప్పవు. డయాబెటిక్ రోగులకు లవంగాలు మేలు చేస్తాయి. లవంగాలను నమలడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. లవంగం టీలో క్రిమినాశక గుణాలు ఉన్నందున ఎలాంటి చర్మ వ్యాధిని అయినా తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే అకాల వృద్ధాప్య సంకేతాలను కూడా నివారిస్తుంది.

## వరకట్న వేధింపులకు వివాహిత బలి



వరకట్న వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపుతోంది. హైదరాబాద్‌లోని గాజులరామారంకి చెందిన అభిలాష్, అమరావతి దంపతులకు 2019లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.4 కోట్లు కట్నం ఇచ్చి పెళ్లి చేశారు. అర కేజీ బంగారం, 2 కేజీల వెండి వస్తువులు, రూ. 10 లక్షల నగదు, హయత్ నగర్‌లో రూ. 3 కోట్ల విలువ చేసే ఫ్లాటు కట్నం కింద ఇచ్చారు. ఈ కట్నం సరిపోలేదని అత్తింటి వారు అమరావతిని వేధించారు. దీంతో అత్తింటి వేధింపులు తట్టుకోలేక అమరావతి సూసైడ్ లెటర్ రాసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన చావుకు భర్త, అత్తమామలే కారణమని రాసి ఆత్మహత్య చేసుకుంది. అయితే వివాహిత రాసిన సూసైడ్ నోట్ కంటతడి పెట్టిస్తోంది. తన పిల్లలను అనాథ ఆశ్రమంలో చేర్పించాలని కోరింది. ఈ ఘటనతో గాజులరామారంలో విషాదచాయలు అలుముకున్నాయి. అమరావతి సోదరుడి ఫిర్యాదు మేరకు అభిలాష్‌తో పాటు అతడి తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేశారు.






తిరుమలలో రథసప్తమి వేడుకలు ప్రారంభం అయ్యాయి.. ఉదయం 5:30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.. ప్రస్తుతం సూర్యప్రభ వాహనంపై తిరుమల మాడవీధుల్లో ఊరేగుతున్నారు మలయప్పస్వామి.. మొత్తం 7 వాహనాలపై భక్తులుకు దర్శనం ఇవ్వనున్నారు మలయప్పస్వామి.. తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహన సేవ, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహన సేవ, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహన సేవ, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహన సేవ, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు శ్రీవారు.

ఇక, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని.. ఈరోజు, రేపు తిరుపతిలో జారీ చేసే సర్వదర్శన టోకెన్లు రద్దు చేసింది టీటీడీ. ఈ రోజు శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు కూడా రద్దు చేసినట్టు టీటీడీ ప్రకటించింది.వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్న భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నారు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయి వెలపల క్యూ లైనులో వేచిఉన్నారు భక్తులు.. శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతుండగా.. నిన్న శ్రీవారిని దర్శించుకున్నారు 45,825 మంది భక్తులు.. 21,380 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.. ఇక, శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లుగా పేర్కొంది టీటీడీ.